క్లుప్తంగా

500 మందికి వైద్య పరీక్షలు



గోపాలపురం మండలం హుకుంపేటలో రోగులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

గోపాలపురం: గోపాలపురం మండలం హుకుంపేటలో ఆదివారం రాజమండ్రి వైద్యులతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. దాత చిర్రావూరి కల్పకం జ్ఞాపకార్థం హుకుంపేట జమీందార్ హోతా సీతారామశాస్త్రి, హోతా రాజాబాబు ఆధ్వర్యంలో సుమారు 500 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. రాజమండ్రి విశ్వస్, ప్రసన్న, రాజానగరం జీఎస్ఎల్, సాగర్ ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

క్రైస్తవ సేవకులపై దాడులు ఆపాలి



గోపాలపురం పోలీసులకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐసీసీ ప్రతినిధులు

గోపాలపురం: క్రైస్తవ సేవలకుపై దాడులు ఆపాలని పాస్టర్లకు రక్షణ కల్పించాలని కోరుతూ గోపాలపురం మండల ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ సభ్యులు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా ఏఐసీసీ మండల అధ్యక్షుడు టి ఏసురాజు మాట్లాడుతూ కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవంలో క్రైస్తవ సేవకుడు విలియం రాజుపై కొంత మంది వ్యక్తులు హత్యాయత్నానికి ప్రయత్నించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. క్రైస్తవులపై భౌతిక దాడులను నివారించేందుకు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె జోషఫ్, తానేటి రాజు మండలంలోని క్రైస్తవ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా పుష్పయాగోత్సవం



దమ్మెన్నులో పార్వతీ సమేత ధర్మేశ్వరస్వామి

ఉండ్రాజవరం: దమ్మెన్నులో పార్వతీ సమేత ధర్మేశ్వరస్వామి కళ్యాణోత్సవాల్లో భాగంగా చివరిరోజు ఆదివారం స్వామివారికి పుష్పయాగోత్సవం, పవళింపు సేవ ఘనంగా నిర్వహించారు. అర్చకులు కాల్దారీ వెంకట సూర్య సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలో స్వామి, అమ్మ వార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ ఎర్రంశెట్టి వెంకటేశ్వరరావు, ఆలయ ఈఓ సోమాల శివ, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ గృహసారథుల సమావేశం

దేవరపల్లి: ద్వారకాతిరుమల, గోపాలపురం మండలాల వైఎస్సార్ సీపీ గృహసారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లకు సోమవారం ఆయా మండల కేంద్రాల్లో సమావేశం నిర్వహించనున్నట్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) తెలిపారు. ఈ సమావేశాలకు స్థానిక ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీ మార్గాని భరత్‌రామ్ హాజరవుతున్నట్టు ఆయన తెలిపారు. ద్వారకాతిరుమల మండల సమావేశం ఉదయం 10 గంటలకు కాపు కల్యాణ మండలంలో, గోపాలపురం మండల సమావేశం మధ్యాహ్నం 3 గంటలకు మార్కెట్ యార్డులో నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి ప్రతి ఒక్కరూ తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

పుష్పాలతో సౌరయాగం




ప్రక్కిలంకలో సూర్యనారాయణమూర్తికి పుష్పాలతో అలంకరణ

తాళ్లపూడి: లోక కల్యాణార్థం మాఘమాసంలో సౌరయాగం పూజలు నెల రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు కౌతవరపు విశ్వనాథ శర్మ తెలిపారు. మండలంలోని ప్రక్కిలంకలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న 14వ సౌరయాగం పూజలు 15వ రోజుకు చేరుకున్నాయి. ఆదివారం ఉదయం నుంచి వేదపండితుల ఆధ్వర్యంలో తులసీ దళాలు, చామంతి, గులాబీ పుష్పాలతో సహస్రనామార్చన, గోపూజ, సూర్యనమస్కారాలు, సౌర జపం, సౌర హోమం తదితర పూజలు నిర్వహించారు. సూర్యనారాయణమూర్తి యంత్రం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శశిశేఖర మిత్ర బృందం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పల్లెల్లో ప్రగతి మల్లెలు

- అభివృద్ధి పథంలో పెండ్యాల గ్రామం
- మూడున్నరేళ్లలో రూ.4.95 కోట్ల కేటాయింపు
- కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం



సీసీ రోడ్లతో కళకళలాడుతున్న పెండ్యాల గ్రామం

నిడదవోలు రూరల్: పల్లెలను ప్రగతి బాట పట్టించి, అక్కడి ప్రజల మెరుగైన జీవన విధానానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యం. ఆ దిశగా సర్కారు ముందడుగు వేసింది. గ్రామాల్లోని ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం రూ.కోట్ల నిధులు మంజూరు చేసింది. ఫలితంగా గోదావరి చెంతనే ఉన్న నిడదవోలు మండలం పెండ్యాల గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతోంది. మూడున్నరేళ్లలో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు సహకారంతో గ్రామంలో రూ.4.95 కోట్ల అభివృద్ధి పనులు చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందించారు. ఇప్పుడక్కడ కాలికి మట్టి అంటని సీసీ రోడ్లు, దుర్వాసన రాని డ్రెయిన్లు, రక్షిత మంచినీటి పైపులైన్లు, అధునాతన వసతులతో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, పాఠశాల భవనాలు దర్శనమిస్తున్నాయి. దీంతో ఆ గ్రామంలో ప్రగతి మల్లెలు విరబూస్తున్నాయి.

మూడున్నరేళ్లలో అభివృద్ధి ఇలా..

- పెండ్యాల గ్రామంలో 3,764 మంది జనాభా ఉండగా, 2,674 మంది ఓటర్లున్నారు. 823 కుటుంబాలు ఉన్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 176 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేశారు. ప్రధానంగా రూ.14 లక్షలతో సీసీ రోడ్లు, ఎస్సీ, బీసీ ఏరియాలో రూ.40 లక్షలతో డ్రెయిన్లు నిర్మించారు. స్థానిక ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.3 లక్షలతో బోరు ఏర్పాటు చేయడంతో పాటు దానికి అనుసంధానంగా జలజీవన్‌మిషన్ పథకంలో భాగంగా రూ.9.41 లక్షలతో పైపులైన్లు విస్తరించారు. గ్రామంలో ఇసుక ర్యాంపు ఉండటంతో సీనరేజి నిధుల్లో భాగంగా మంజూరైన రూ.24 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు.



ప్రారంభానికి సిద్ధమైన గ్రామ సచివాలయ భవనం



పెండ్యాలలో సీసీ డ్రెయిన్ల నిర్మాణం

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

వైఎస్సార్–జగనన్న కాలనీలో 32 మంది లబ్ధిదారులకు ఇళ్లస్థలాలు మంజూరు చేయడంతో పాటు 80 మంది లబ్ధిదారులకు ఇల్లు మంజూరు చేశారు. ఇప్పటికే 48 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించి గృహప్రవేశాలు చేశారు. గ్రామంలో సచివాలయం రూ.40 లక్షలతో, రైతు భరోసా కేంద్రం రూ. 21.08 లక్షలతో భవన నిర్మాణాలు పూర్తిచేశారు. అవి త్వరలోనే ప్రారంభించేందుకు సిద్ధమయ్యాయి. నాడు–నేడు పథకంలో భాగంగా స్థానిక జెడ్పీ హైస్కూలును రూ.కోటి నిధులతో, ఎంపీయూపీ రూ.14 లక్షలతో అభివృద్ధి చేస్తున్నారు. తొలి విడతలో ప్రాథమిక పాఠశాల–1 రూ.14 లక్షలతో నూతన హంగులతో తీర్చిదిద్దారు.

అన్నదాతలకు అండగా పథకాలు

రైతులకు అండగా గతేడాది గోదావరి వరదముంపుతో నష్టపోయిన 96 మంది రైతులకు రూ.6 లక్షలు పరిహారం అందజేశారు. రైతు భరోసా పథకం ద్వారా ప్రతి ఏడాది 536 మంది రైతులకు రైతు భరోసా అందిస్తున్నారు. సీహెచ్‌సీ ద్వారా శ్రీలక్ష్మీగణపతి గ్రూపుకు రూ.8లక్షల రాయితీపై కోతమిషన్‌తో పాటు రెండు ట్రాక్టర్లు అందజేశారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు



గ్రామంలో పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. గతంలో ఎస్సీ కాలనీలో రోడ్లు, డ్రెయిన్లు లేకపోవడంతో ఇబ్బందిపడే వాళ్లం. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు నిర్మించడంతో మా ఊరు కళకళలాడుతోంది. సచివాలయ వ్యవస్థతో మాకు భరోసా ఇచ్చిన ప్రభుత్వానికి అండగా నిలుస్తాం.

\- ఎ.మరియమ్మ, పెండ్యాల

తాగునీటి సమస్య తీరింది



పైపులైన్లు అస్తవ్యస్తంగా ఉండటంతో జలజీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామంలో పైపులైన్లు విస్తరించారు. పంచాయతీ కొత్తగా బోరు కూడా వేయడంతో తాగునీటి సమస్య తీరింది. ప్రతిపక్ష నాయకులకు మా ఊరొస్తే ఇక్కడ జరిగిన అభివృద్ధిని దగ్గరుండి చూపిస్తాం. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయడంతో అన్నివర్గాల ప్రజలు ఆనందంగా ఉన్నారు.

\- ఉప్పులూరి రామకృష్ణాంజనేయులు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు, పెండ్యాల

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి



పెండ్యాల గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు ఎంతో సహకరిస్తున్నారు. ఈ మూడున్నరేళ్లలో రూ.4.95 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించాం. గత ప్రభుత్వాలు అధికారంలో ఉన్న సమయంలో అభివృద్ధికి నోచుకోలేదు. ఇక్కడ ప్రతిపక్ష పార్టీ నాయకులు అభివృద్ధిని అడ్డుకునేందుకు లేనిపోని విమర్శలు చేస్తున్నారు. గ్రామస్తుల సహకారంతో పెండ్యాలను మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దుతాను.

\- కారింకి అన్నవరం, సర్పంచ్, పెండ్యాల

ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



నల్లజర్లలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అని, పథకాలపై ఇంటింటికీ విస్తృత ప్రచార కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు సమన్వయంతో కృషి చేయాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కోరారు. నల్లజర్ల ప్రియాంక కన్వెన్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో ఎమ్మెల్యే తలారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వచ్చే ఎన్నికలలో పార్టీ విజయానికి పార్టీ నేతలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, అభిమానులంతా సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. 2024లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు పాటుపడుతున్నారని, ఇప్పటివరకు 98శాతం హామీలు నెరవేర్చారని అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ఆయన ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు ఆదర్శంగా నిలిచాయన్నారు. వలంటీర్లతో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించడం, తాజాగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులను నియమించడంతో ప్రతిపక్ష పార్టీలకు వణుకు పుడుతోందన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తూ కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరావు (జీవీ) మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతిరహిత పాలన కొనసాగుతోందని, పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్ పనిచేస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించే దిశగా కన్వీనర్లు, గృహసారథులు పని చేయాలన్నారు. సచివాలయ మండల కన్వీనర్ నక్కా పండు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, పెండ్యాల హారేరామకృష్ణ, బంక అప్పారావు, వెల్లంకి వెంకటసుబ్రమణ్యం, ముప్పిడి వెంకటరత్నం, మద్దిపాటి ప్రసాద్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు

దేవరపల్లి: కాకినాడలో ఆదివారం నిర్వహించిన అంతర్ రాష్ట్ర కరాటే పోటీల్లో దేవరపల్లి మండలం యర్నగూడెంకు సెయింట్ జోసఫ్స్ హైస్కూలు విద్యార్థులు సత్తా చాటారు. విద్యార్థులు ఎం. కౌశిక్ కుమార్, డి. అభిషేక్, జి. వరుణ్, ఎ. లికిల్, డి. జ్యోతి ప్రకాష్, ఎ. కమలాకర్, ఎం. లోకేష్, ఎస్. రష్మిక, జి. కార్తీక్ గణేష్, జి. వరుణ్, ఎ. లిఖిత, టి. దేవిచరణ్, టి. దేవి పోటీల్లో పాల్గొని 20 స్వర్ణపతకాలు, 15 సిల్వర్, ఏడు కాంస్య పతకాలు సాధించినట్టు కరాటే మాస్టార్ ఎ. సామ్యూల్ రాజు తెలిపారు. నాలుగు రాష్ట్రాల నుంచి 600 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నట్టు ఆయన తెలిపారు. ప్రముఖ కరాటే మాస్టార్ కేతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారని ఆయన తెలిపారు.



బంగారు పతకాలతో యర్నగూడెం విద్యార్థులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొవ్వూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై చికిత్స పొందుతూ కొవ్వూరు అచ్చాయమ్మ కాలనీకి చెందిన జమ్ము సూర్యప్రకాష్ (40) శనివారం రాత్రి మరణించారు. తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్న సూర్యప్రకాష్ శనివారం ఉదయం మోటారు సైకిల్‌పై దేవరపల్లి వెళ్లి సాయంత్రం తిరిగి వస్తుండగా దొమ్మేరు శ్మశాన వాటిక సమీపంలో అదుపుతప్పి రోడ్డుపై పడిపోయారు. దీంతో తలకి బలమైన గాయమైంది. ఆయనను 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందారు. మృతుడి తండ్రి జమ్ము రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ ఆర్.సత్యనారాయణ తెలిపారు. మృతుడు సూర్యప్రకాష్‌కి 18 ఏళ్ల క్రితం వివాహమైందని, పదేళ్ల క్రితం భార్యతో విడిపోయి వేరుగా ఉంటున్నారని హెచ్‌సీ తెలిపారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ



దివ్యాంగులకు ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యురాలు

నిడదవోలు : మండలంలోని శంఖరాపురం మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రం, మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల (హృదయాలయం)లో సహాయ స్వచ్ఛంద సంస్థ, హోప్ ఫర్ స్పందన సంస్థ (యూఎస్ఏ) సహకారంతో ఆదివారం దివ్యాంగులకు ఉచిత ఫిజియోథెరపీ సేవలందించారు. ఈ సందర్భంగా సహాయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, నిర్వాహకులు దండే గణేష్‌బాబు మాట్లాడుతూ హృదయాలయంలో ఆశ్రయం పొందుతున్న మానసిక దివ్యాంగులతో పాటు బయట నుంచి వచ్చే చిన్నారులకు వారంలో మూడు రోజుల పాటు ఉచితంగా ఫిజియోథెరపీ సేవలందిస్తున్నామన్నారు. ఇక్కడికి వచ్చే చిన్నారులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని నిర్వాహకులు బలగం విశాలాక్షి తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్వేత పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాల లబ్ధి

- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత
- కుమారదేవంలో గడప గడపకూ మన ప్రభుత్వం



కొవ్వూరు మండలం కుమారదేవంలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: నేరుగా లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. మండలంలో కుమారదేవంలో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హోం మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు మూడున్నరేళ్ల కాలంలో చేకూరిన లబ్ధిని వివరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పథకాలు అందుతున్నాయా అని ప్రతి ఒక్కరినీ ఆరా తీశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రాజకీయాలు, కుల, మతాలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ (నారాయుడు), జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, మండల పార్టీ గౌరవ అధ్యక్షుడు గన్నమని వెంకటరాజు(రాజు), కుమారదేవం ఎత్తి పోతల పథకం చైర్మన్ గోలి శ్రీనివాస్, సర్పంచ్ కాసాని దుర్గ, ఎంపీటీసీ సభ్యురాలు యండపల్లి నటరాజ రాణి, గోరిజాల పేర్రాజు, గంధం శ్రీనివాస్, కాట్రు అనితశ్రీ, పోసిన శ్రీకృష్ణ దేవరాయులు, ఉప్పులూరి సూరిబాబు, ఆరికిరేవుల సొసైటీ అధ్యక్షుడు పామెర్ల నగేష్, చిట్టూరి అన్నవరం, వెంపాటి సురేష్ పాల్గొన్నారు.

బస్టాండ్‌కు అడ్డంగా ఫ్లెక్సీల ఏర్పాటు

దేవరపల్లి: దేవరపల్లి మండలం యర్నగూడెం బస్టాండ్‌ను ఫ్లెక్సీలతో మూసివేశాయి. బస్టాండ్ పైభాగంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు పోటాపోటీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. టీడీపీ చెందిన నాయకులు మరొక అడుగు ముందుకు వేసి బస్టాండ్ ఆవరణలో సెంటర్ లైటింగ్ పోలుకు అనుకుని ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో బస్సుల రాకపోకలు ఆటంకం ఏర్పడింది. ఈ ఫ్లెక్సీ అడ్డుగా ఉండడంతో బస్సులు రావడం లేదని ప్రయాణిలకు వాపోతున్నారు. బస్టాండ్‌లో ఆటోలు, మోటారు సైకిళ్ల పార్కింగ్ చేయడం వల్ల ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలని, ఆటోలు, మోటారు సైకిళ్లు పార్కింగ్ చేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఘంటసాల గానం అజరామరం



పోతవరంలో ఘంటసాల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

నల్లజర్ల: ఘంటసాల గానం అజరామరమని పలువురు అభిమానులు పేర్కొన్నారు. నల్లజర్ల మండలం పోతవరంలో దొంతోజు కృష్ణస్వామి మిత్రమండలి ఆధ్వర్యంలో ఘంటసాల 49వ వర్ధంతి సందర్భంగా ఆదివారం రాత్రి 14వ వార్షికోత్సవ సంగీత ఆరాధనోత్సవం వైభవంగా నిర్వహించారు. సభకు బుద్దాల వెంకటేశ్వరావు అధ్యక్షత వహించారు. గాయకులు పంజా వెంకటేశ్వరావు, సర్పంచ్ నూతికుర్తి లక్ష్మణరావు, ఏలేటి వీరవెంకటసత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు పెండ్యాల హరేరామకృష్ణ, మాజీ సర్పంచ్ పసుమర్తి రతీష్, చిలుకూరి సబ్బయ్యాచారిని ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. అనంతరం ఘంటసాల సంగీత విభావరి నిర్వహించారు. కేకే రాజు, కుందా శ్రీరామకృష్ణశాస్త్రి, పసుమర్తి కృష్ణ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

నిడదవోలు రూరల్: మండలంలోని పురుషోత్తపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు నిమిత్తం మంగళవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏఇ బి.వి.రమణామూర్తి ఆదివారం తెలిపారు. పురుషోత్తపల్లి, గోపవరం, విజ్జేశ్వరం, అట్లపాడు, పందలపర్రు, డి.ముప్పవరం, రావివారిగూడెం, కలవచర్ల, జీడిగుంట, కోరుపల్లి, మునిపల్లి, పెండ్యాల గ్రామాల పరిధిలో విద్యుత్ నిలిపివేస్తామన్నారు. వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా లక్ష్మీనారాయణుల కల్యాణోత్సవం



తాళ్లపూడిలో లక్ష్మీనారాయణుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

తాళ్లపూడి: తాళ్లపూడిలోని రుక్మిణి, సత్యభామ సమేత మదనగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీలక్ష్మీనారాయణుల కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. గోకవరపు మాణిక్యం, అప్పన రామకృష్ణ, వంకాయల వెంకటరావు బహదూర్ దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పుష్పాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు ఈ కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు.

కోటసత్తెమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక పుష్పాలంకరణలో కోటసత్తెమ్మవారు

నిడదవోలు రూరల్: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు పోటెత్తారు. దేవస్థానం ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించి పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం(శివ) తెలిపారు. భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయానికి వివిధ రూపాల్లో రూ.1,25,857 ఆదాయం సమకూరింది. ఆలయ ఫౌండర్ ఫ్యామిటీ మెంబర్ దేవులపల్లి రామసుబ్బరాయశాస్త్రి, ధర్మకర్తల మండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరికి మహా నీరాజనం

కొవ్వూరు: మాఘ పౌర్ణమి సందర్భంగా పట్టణంలో గోష్పాద క్షేత్రంలో ఆదివారం రాత్రి గోదావరి నదికి మహా నీరాజనం సమర్పించారు. అంతకు ముందు గోదావరి మాతకు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నీరాజన సమితి అధ్యక్షుడు కలిగొట్ల కృష్ణారావు ఆధ్వర్యంలో గోదావరి నదికి వివిధ రకాల హారతులు సమర్పించారు. మాఘ పౌర్ణమి సందర్భంగా పట్టణంలో సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని గోష్పాదేశ్వరస్వామి ఆలయం విశేష పూజలు నిర్వహించారు.

విద్యుత్ మోటార్ల చోరీపై కేసు

నిడదవోలు రూరల్: పురుషోత్తపల్లిలో నాలుగు విద్యుత్ మోటార్ల చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ సుభానీ ఆదివారం తెలిపారు. పురుషోత్తపల్లికి చెందిన ఇమ్మణి వెంకటనారాయణకు చెందిన మోటార్‌తో పాటు మరో ముగ్గురు రైతులకు చెందిన విద్యుత్ మోటార్లు ఈనెల 5న గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారన్నారు. బాధితుడు వెంకటనారాయణ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

13న వాహనాల వేలం

కొవ్వూరు: వివిధ కేసుల్లో పట్టుబడిన మోటారు సైకిళ్లు, ఇతర వాహనాలకు ఈనెల 13న వేలం నిర్వహించనున్నట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. 32 మోటారు సైకిళ్లు, ఆటో, కారు, టాటా ఏసీ వ్యాన్లను ఉదయం 10 గంటలకు కొవ్వూరు ఎస్ఈబీ స్టేషన్ వద్ద వేలం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తిగల వారు రూ.5 వేలు ధరవత్తు చెల్లించి వేలంలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

శ్రీనివాసరావుకు ఘన నివాళి

కొవ్వూరు: దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం జెడ్పీ హైస్కూలు హెచ్ఎం వేమూరి శ్రీనివాసరావు సంస్మరణ సభ పశివేదలలో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈయన ఇటీవల నిడదవోలు సమీపంలో రైలు ప్రమాదంలో దుర్మరణం పాలైన విషయం తెలిసిందే. పలువురు వక్తలు ఆయనతో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు తెచ్చుకున్నారు. గతంలో పశివేదల హైస్కూల్లో తొమ్మిదేళ్లు పనిచేసిన సమయంలో ఆయనతో పాటు కలిసి పనిచేసిన ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది ఆయన సేవలను కొనియాడారు. డీపీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి దున్నా ప్రకాష్‌రావు, కె.లక్ష్మణరావు, కె.పుల్లారావు, ఏడు కొండలు, డీపీఆర్టీయూ మండల అధ్యక్షుడు జొన్నకూటి పాండు, తదితరులు ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.